నవరత్నాలతో ప్రతి కుటుంబంలో సంతోషం

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



ఆల్విన్ కాలనీలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: నవరత్నాలతో ప్రతి కుటుంబంలోనూ సంతోషం నెలకొందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో హెచ్‌ఎంటీ, ఆల్విన్ కాలనీలో సోమవారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో పెనుకొండ నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నందిని, జయశంకరరెడ్డిలతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారానే కాకుండా ఇతర సంక్షేమ పథకాల కింద అందిన లబ్ధిని వివరించారు. ఏఏ పథకం ఎంత మేర సంక్షేమ లబ్ధి చేకూరిందన్న విషయాన్ని ప్రజలకు వివరించారు.

అవినీతికి తావే లేదు

ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ప్రతి గడపలో సంతోషం నింపారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా పేదలు, మహిళలు, ఇతర అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని రూ.2 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేసి ఎక్కడా అవినీతి అన్న పదానికి తావు లేకుండా చేశారన్నారు. అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్న కాలనీలు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, నాడు – నేడు లాంటి పథకాలతో ప్రజా రంజక పాలన సాగిస్తున్నారన్నారు. అదేవిధంగా నూతనంగా షాదీతోఫా, కళ్యాణమస్తు , పింఛన్ పెంపు లాంటి విషయాలను వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజారంజక పాలన అందిస్తున్న గొప్ప ముఖ్యమంత్రిని ప్రజలు దీవించి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు అందించడానికి ముఖ్యమంత్రి కంకణబద్ధుడై ఉన్నారని స్పష్టం చేశారు. రోడ్లు, డ్రైనేజీలు, కొళాయిలు, వీధిలైట్లు వేయించాలని స్థానికులు ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శంకరనారాయణ వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే పింఛన్లు ,ఇళ్లు మంజూరు చేయించాలని పలువురు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

జగనన్నకు అండగా ఉండాలి

ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రతి కుటుంబం చల్లగా ఉంటుందని, అన్ని వర్గాల వారూ జగనన్నకు అండగా ఉండాలని కోరారు. అనంతరం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నందిని, జయశంకరరెడ్డి, బోయ సునీల్ , ఎంపీపీ గీత, జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సోమందేపల్లి: మండలంలోని పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగప్ప (65) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి చేరుకొని రామలింగప్ప మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన తనయుడు నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు భారతిని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యులు అశోక్, ఎల్లారెడ్డి, మురళీ, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని గణపతిపల్లిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామాంజి తండ్రి లక్ష్మీనారాయణ ఆదివారం మరణించారు. అలాగే మోదా గ్రామానికి చెందిన మరో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు నారాయణస్వామి తండ్రి చిన్నప్పయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ సోమవారం మండలానికి వచ్చారు. తొలుత గణపతిపల్లిలో లక్ష్మీనారాయణ భౌతిక దేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మోదాకు వెళ్లి చిన్నప్పయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ సవిత , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, సర్పంచ్‌లు దిలీప్, లక్ష్మన్న, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, మోహన్, మంజు, మాజీ కన్వీనర్ జయరాం తదితరులు ఉన్నారు.



క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిరరూరల్: మండల పరిధిలోని జీవీ పాళ్యం గ్రామ సచివాలయం పరిధిలోని జీవీ పాళ్యం గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

పెనుకొండ: పట్టణంలోని 6,7, 8 వార్డులోని దర్గా రోడ్డు, ఉప్పరబాడ, సొదాగర్ ప్రాంతంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని నగర పంచాయతీ కమీషనర్ వంశీకృష్ణ భార్గవ్ సోమవారం తెలిపారు.

అటవీ ప్రాంతానికి నిప్పు



రొళ్ల: రొళ్ల మండలం కొడగార్లగుట్ట గ్రామ సమీపంలోని జాతీయ ప్రధాన రోడ్డు మార్గం పక్కన ఉన్న అటవీ ప్రాంతానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సోమవారం వందలాది చెట్లు కాలిబూడిదయ్యాయి. సంబంధిత అధికారులు నిఘా ఉంచి చెట్లను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు జ్యోతుల ఉత్సవం



బయలు అంజనేయస్వామి మూలావిరాట్

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీనగర్ సమీపంలోని పెనుకొండ–పేరూరు ప్రధాన రహదారి పక్కన వెలసిన బయలు అంజనేయస్వామికి మంగళవారం మండల పూజ నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీనివాసులు తెలిపారు. దీంతో ప్రత్యేక పూజలతో పాటు జ్యోతుల మహోత్సవం ఉంటుందన్నారు. అలాగే నారనాగేపల్లిలో వెలసిన ముత్యాలమ్మదేవికి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రొద్దం: 'విధులకు పంచాయతీ కార్యదర్శి డుమ్మా' అనే శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ స్పందించారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని కోగిర గ్రామ పంచాయతీ కార్యదర్శి కేశవరెడ్డిపై జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ పంపినట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విధులకు హాజరు కాకపోవడంతో వివిధ పనులపై సచివాయాలనికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అట్టహాసంగా నామినేషన్ల పర్వం



నామినేషన్‌కు ఎద్దుల బండిలో వస్తున్న కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ అభ్యర్థి నాగేంద్ర

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ సోమవారం అట్టహాసంగా సాగింది. కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ అభ్యర్థి నేరళకుంటె నాగేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. వందలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు వెంట రాగా వినూత్నంగా ఎద్దుల బండిలో వచ్చి నామినేషన్ వేశారు. అయితే పత్రాలు సరిగా లేకపోవడంతో పత్రాన్ని అధికారులు తిరస్కరించగా.. మళ్లీ మంగళవారం సమర్పించే అవకాశముందని నాయకులు తెలిపారు. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి ఎన్ రామాంజినప్ప నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు.

గృహాలు మంజూరు చేయాలి

గోరంట్ల: మండలంలోని పవర్ లూమ్ కార్మికులందరికీ మూడు సెంట్ల స్థలంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పవర్ లూమ్ కార్మికులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. నాయకులు శ్రీరాములు, మధు, మండల నాయకులు శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వెంకటస్వామి



కాంగ్రెస్ పార్టీలో చేరినవెంకటస్వామి

పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ గెలుపునకు కృషి చేస్తానని మాజీ మున్సిపల్ చైర్మన్ మానం వెంకటస్వామి తెలిపారు. స్థానిక సాయిరాం మందిరంలో సోమవారం నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఆయన ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రాణహాని ఉంది.. కాపాడండి సార్



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న భూయజమానులు

పెనుకొండ: భూకబ్జాదారుల నుంచి తమకు ప్రాణహాని ఉందని, తమను రక్షణ భిక్ష పెట్టాలని పలు ముస్లీం కుటుంబాలు సబ్‌కలెక్టర్ కార్తీక్‌ను వేడుకున్నాయి. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం. సీఐటీయూ, కులవివక్ష సంఘాల నాయకులతో కలిసి ముస్లింలు ధర్నా చేశారు. సర్వే నంబర్లు 451, 453–1, 453–4 ల్లోని రూ.కోట్ల విలువైన భూములను మాదిగ రామాంజినేయులు, మాదిగ వెంకటేసులు, వారి కుటుంబ సభ్యులు ఫోర్జరీ డాక్యుమెంట్లతో కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని భూయజమానులు ముకరమ్, మునరత్ తదితరులు తెలిపారు. గతంలో పెనుకొండ తహసీల్దార్‌గా పని చేసి ప్రస్తుతం పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏఓగా పని చేస్తున్నా నాగరాజు వెనుక ఉన్నారని ఆరోపించారు. సదరు కబ్జాదారుల నుంచి తమ ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. పోలీసులతో మాట్లాడి రక్షణ కల్పిస్తామని, సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ కార్తీక్ వారికి హామీ ఇచ్చారు.

నీటి తొట్టెల మరమ్మతుకు చర్యలు



తాగునీటి తొట్టెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో దెబ్బతిన్న తాగునీటి తొట్టిలను మరమ్మతు చేయించి నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. రెండు రోజుల క్రితం గోవిందాపురం, టీడీపల్లి గ్రామాల్లో గడప గడప కార్యక్రమంలో దెబ్బతిన్న తాగునీటి తొట్టిలను మరమ్మతు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి దెబ్బతిన్న తాగునీటి తొట్టిని పరిశీలించి మర్మమతు చేయించడంతో పాటు పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. నీటిని సరఫరా చేయడం ద్వారా మూగజీవాలకు తాగునీటి ఇబ్బంది ఉండదన్నారు. అలాగే గ్రామాల్లో ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

హిందూపురం టౌన్: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్, కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని ఏఐయూటీయూసీ, ఏపీ ఐక్య గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ విలేకరుల సమావేశం నిర్వహించారు. గుర్తింపు కార్డులు, పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఐయూటీయూసీ జిల్లా కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఏపీ ఐక్య గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, ఏఐకేకేఎంఎస్ రాష్ట్ర నాయకులు గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

19న వాహనాల వేలం

గోరంట్ల: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 19న ఉదయం 10 గంటలకు గోరంట్ల పోలీసు స్టేషన్ ప్రాంగణంలో వేలం వేయనున్నట్లు సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఒక ఆటోతో పాటు 30 ద్విచక్ర వాహనాలున్నాయన్నారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ

రొళ్ల: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 3,398 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందిన గ్లాసులను ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

నేడు శ్రీకంఠపురం ముత్యాలమ్మ జాతర

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురంలో వెలసిన ముత్యాలమ్మదేవి జాతర ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత నిర్వమంగళవారం నిర్వహిస్తున్న జాతర కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. శ్రీకంఠపురంలో సుమారు వెయ్యి కుటుంబాలకు పైగా ముత్యాలమ్మ పండుగను జాతరలా నిర్వహించనున్నారు. శ్రీకంఠపురం జాతరను పురస్కరించుకొని సుమారు రూ.2 కోట్లకు పైగానే వ్యయం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్‌లో అగ్ని ప్రమాదాలు, సత్వర రక్షణ పొందేందుకు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర విపత్తు నియంత్రణ, అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలతో పాటూ విద్యుత్, వంటగ్యాస్ లీకేజ్ వల్ల కలిగే ప్రమాదాలను నిర్లక్ష్యం చేస్తే భారీ ఆస్తి నష్టం జరగడంతో పాటూ ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం మాక్ డ్రిల్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మడకశిర: పట్టణంలోని గురుకుల బీసీ బాలికల పాఠశాల ఆవరణంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రిప్ వాడకంపై అవగాహన

మడకశిర: నియోజకవర్గంలో డ్రిప్ వాడకంపై ఏపీఎంఐపీ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సోమవారం గుడిబండ మండలంలోని మోరుబాగల్, జీఎస్ తండా, పీగొల్లహట్టి గ్రామాల్లో ఏపీఎంఐపీ అధికారి నరసింహప్ప పర్యటించి సబ్సిడీతో వివిధ పంటలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రిప్ వాడకంపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లేపాక్షి: మండలంలోని ఈదులబళాపురం నుంచి గోళ్లాపురంకు 220 కేవీ కొత్త విద్యుత్‌లైన్ లాగుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశులు తెలిపారు. ఇందులో భాగంగానే ఆయా గ్రామాల పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. శిరివరం సబ్ స్టేషన్ పరిధిలోని శిరివరం ఫీడర్‌లో శిరివరం , మానేపల్లి గ్రామాలకు, తిరుమలదేవరపల్లి ఫీడర్‌లోని కోడిపల్లి, విబూతిపల్లి, నాగేపల్లి, తిరుమలదేవరపల్లి, ఎస్.కొత్తపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామ సమీపంలో సోమవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సచివాలయ కార్యదర్శి సావిత్రి తెలిపారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులతో పాటు నూతన కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమీప ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు గ్రామానికి చెందిన నటరాజు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. నటరాజు కొంకల్లు నుంచి మడకశిరకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అయితే భూతప్ప కనుమలోని మలుపు వద్ద అటు వస్తున్న కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ఘటనలో నటరాజుకు కాలు విరిగింది. క్షతగ్రాతుడిని వెంటనే 108 వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనం




లోకేశ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: దళితులను కించపరచి మట్లాడడం టీడీపీ నాయకులకు అలవాటేనని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ దళితులను కించపరచి మాట్లాడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నారా లోకేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జయరాజు, విక్రమ్, నాగేంద్ర, జమ్మానిపల్లి మూర్తి, వైస్ ఎంపీపీ మూర్తి, లక్ష్మీనారాయణ, మంజునాథ్, నగేష్, గోపి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో ఇఫ్తార్ విందు

లేపాక్షి: మండల కేంద్రంలోని మసీదులో సోమవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల తర్వాత విందు నిర్వహించారు. సర్పంచ్ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ మాన్యువల్స్ పంపిణీ



ఆరోగ్యశ్రీ మాన్యువల్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: ముఖ్యమంత్రి అమలు చేస్తోన్న ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ శిక్షణకు సంబంధించిన మాన్యువల్స్ పంపిణీ చేస్తోంది. అందులో భాగంగానే సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రామకృష్ణ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలకు వాటిని పంపిణీ చేశారు.

వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్'



హిందూపురం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ



మడకశిర: భక్తరహళ్లిలో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న గృహసారథులు



పెనుకొండ రూరల్: నాగలూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

హిందూపురం: పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వాడ వాడలా కొనసాగుతోంది. హిందూపురం పట్టణంలోని 13, 25, 27, 28, 30 తదితర వార్డుల్లో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు ఆ వార్డు కౌన్సిలర్లు, కన్వీనర్లు గృహసారథులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లు అతికించి, మిస్డ్‌కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున, నాగేంద్రమ్మ, సునిత కన్వీనర్లు, నాయకులు కార్తీక్, వెంకటేష్‌రెడ్డి, గాయత్రీ, చంద్ర, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగనన్నను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. సోమవారం హిందూపురం మండలంలోని కిరికెర పంచాయతీలోని అప్పలకుంట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు సుధాకర్ రెడ్డి, గోవిందప్ప, తిమ్మిరెడ్డి, నారాయణరెడ్డి, బాలిరెడ్డి, రామాంజి, రంగనాథ్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని మోపురుగుండు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సచివాలయ కన్వీనర్ దేవరాజు, శివకుమార్, ముద్దప్ప, కమలాక్షి, గృహసారథులు రనాజేష్, పునీత్, బంగారులింగ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొందుతున్న లబ్ధిని వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరు, అడదాకులపల్లి, వెంకటరెడ్డిపల్లి, తిమ్మాపురం, శెట్టిపల్లి, మునిమడుగు, కొండాపురం, కోనాపురం గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మోసంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న మంచిని ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, శేషాద్రి, వెంకటేష్, తిరుపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతి అక్రమాలకు తావు లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలననే తామంతా ముక్తకంఠంతో కోరుతున్నామని మండల ప్రజలు తెలిపారు. సోమవారం మండలంలోని పైడేటి, కొడిగెనహళ్లి, పెద్దిరెడ్డిపల్లి, శ్రీరంగరాజుపల్లి గ్రామ పంచాయతీ గ్రామాల్లో జగనన్నే మా నమ్మకం– మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమాల్లో ఎంపీపీ సవిత , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, నాయకులు బీఆర్ నారాయణ, నరసింహారెడ్డి, గఫూర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో సోమవారం జేసీఎస్ కన్వీనర్ విక్రమ్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర(అగళి): అగళి మండలంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఊరూరా జరిగింది. జేసీఎస్ కన్వీనర్ శివన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరించారు. జగనన్నకు అండగా ఉండాలని కోరారు.

సంక్షేమ పాలన బీజేపీకే సాధ్యం

పావగడ: రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వంలో సంక్షేమ పాలన అందించాలంటే కేవలం బీజేపీకే సాధ్యమని స్థానిక మాజీ జెడ్పీ సభ్యుడు డా చక్కరరెడ్డి అన్నారు. స్థానిక ఐఎంఏ భవనంలో సోమవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సభలో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీ లో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిశంకరనాయక్, డా వెంకట్రామయ్య, మాధవరెడ్డి, కోటీశ్వరరెడ్డి, శ్రీనివాస్, శ్రీరామ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళ జాగ్రత్తగా ఉండండి

అమరాపురం: మండల కేంద్రంలో ప్రజలు రాత్రి వేళ తమ ఇళ్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని పోలీసులు తెలిపారు. అమరాపురంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచారం చేస్తున్నారని, దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఎవరైనా ఊరికి వెళితే పోలీసులకు, ఇరుగు పొరుగు వారికి చెప్పి వెళ్లాలన్నారు.

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు రేపు

పెనుకొండ: అంగన్‌వాడీ పోస్టులకు ఈ నెల 19న సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

ముగ్గురికి గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లి సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. అమరాపురానికి చెందిన రాజప్ప కుమారుడు చింతు, జయలక్ష్మీ కుమారుడు మనోభిరామ్ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అదుపు తప్పి కింద పడ్డారు. వీరిని చూడటానికి వెళ్లిన వీరాపురానికి చెందిన సిద్ధేశ్వర కుమారుడు సచిన్ అదే స్థలంలో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ముగ్గురిని మడకశిర ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు అభినందన

పరిగి: శాస్త్రీయ విజ్ఞానాన్ని అందరూ అలవరచుకోవాలని, సైన్స్‌తోనే మేధాశక్తి పెంపొందుతుందని కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. జాతీయ స్థాయికి జరిగే విద్యార్థి విజ్ఞాన మంథన్ సైన్స్ టాలెంట్ టెస్టులో స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు రాణించి జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. అహ్మద్ హుస్సేన్ మొదటి ర్యాంకు, హేమంత్‌కుమార్, యాగ్నిక్ 3వ ర్యాంకు, 10వ తరగతికి చెందిన నరసింహానాయుడు రెండో ర్యాంకును సాధించగా...ఇలాహీ అనే విద్యార్థికి మూడో ర్యాంకు వచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.